www.aakshitha.com
People's voice
# అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
## తెలంగాణ దిక్సూచి
శనివారం | 24 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08





# జోడు పదవులు లక్షల్లో దందా!

**ఒకే వ్యక్తి.. రెండు పదవులు!!**

**రామానుజవరంలో సర్పంచ్ దంపతుల అవినీతి దందా!**

**గతంలో ‘ అక్షిత’ ప్రచురించినా మారని తీరు..**
**మరింత శృతిమించిన అక్రమాలు!**

**ఒకే స్థానంలో రెండు పదవులు..**
**ఇసుక సొసైటీ బాధ్యతల్లో సర్పంచ్ కల్పన!**

**లారీకి వంద చొప్పున రూ. 13 లక్షల దందా..**
**లెక్కలడిగితే బెదిరింపుల పర్వం!**

**సర్పంచ్ భర్త 'బాడిష సతీష్' అక్రమ జోక్యం..**
**సంతకం లేకుండానే నిధుల స్వాహా!**

**కలెక్టర్, డిపిఓ, ఎమ్మెల్యేకు ఆధారాలతో ఫిర్యాదు..**
**ఊడనున్న సర్పంచ్ పదవి!**


అక్షిత
జనరల్
"అటు నేనే... ఇటు నేనే"

**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో:** రామానుజవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కల్పన దంపతులు జరుపుతున్న అధికార దుర్వినియోగం, ఇసుక సొసైటీ అక్రమాలపై గతంలోనే వార్తా కథనం వెలువడినప్పటికీ అధికారుల తీరు మారక పోవడంపై స్థానికులు మండి పడుతున్నారు ..మిగతా 2లో




# మూడేళ్లకే లీజు ఏడేళ్లకైనా!




**“ఎంపీపీ షాప్‌ల లీజు మూడేళ్లకే.. ఏడేళ్లు దాటిన చర్యలేవి...!”**

**ఎంపీపీ షట్టర్ల లీజుపై నిర్లక్ష్యపు నీడలు**

**గడువు ముగిసినా చర్యలు శూన్యం**

**లీజు గడువు ముగిసినా కొనసాగింపేనా?**

**ఎంపీపీ దుకాణాలపై అధికారులకు పట్టింపు లేదా?**

**దుకాణాల లీజు వ్యవహారంలో నిబంధనలు అమలయ్యాయా?**

**ఏడేళ్ల కాలంపై సమాధానమేదీ?**

**అండర్‌టేకింగ్‌లో షరతులు స్పష్టమయినా కొనసాగుతున్న లీజు?**

**అదే వ్యక్తుల ఆధీనంలో దుకాణాలు**

**అధికారుల తీరుపై ప్రశ్నలు**

2

# ఆహ్లాదం... ఆనందం

**రూ.19 కోట్లతో సుందరీకరణ**

**రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి**

**చెరువు సుందరీకరణ పనుల పరిశీలన**

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్, అక్షిత ప్రతినిధి:** ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 18.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు సుందరీకరణ, అభివృద్ధి కోసం రూ.19 కోట్ల నిధులు కేటాయించడంతో చెరువుకు మహర్దశ పట్టనుంది. హైడ్రా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులు పూర్తయితే చెరువు రూపురేఖలు మారడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి ..మిగతా 2లో



www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# మూడేళ్లకే లీజు ఏడేళ్ళకైనా !




**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి:** పటాన్‌చెరు మండల ప్రజా పరిషత్ దుకాణముల సముదాయం లోని 52 షట్టర్లకు రిజర్వేషన్ ప్రతిపాదిత నెలవారీ అద్దె రూ.5 వేలు కాగా, జనరల్ కేటగిరీకి రూ.10 వేలుగా ప్రతిపాదించారు. అలాగే డీఆర్‌డీఏకు సంబంధించిన మూడు షట్టర్లకు నెలవారీ అద్దె రూ.7 వేలుగా ప్రతిపాదించారు. అయితే, సంబంధిత షట్టర్లకు మంజూరైన మూడేళ్ల లీజు గడువు ముగిసినప్పటికీ, ఇప్పటికీ వాటిని కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా, షట్టర్లను సబ్ లీజుకు ఇస్తూ, మండల పరిషత్‌కు చెల్లించాల్సిన అద్దెకు అదనంగా నెలకు సుమారు రూ.10 నుండి 15 వేలు వరకు వసూలు చేస్తున్నారని సబ్‌లీజు దారులు చెబుతున్నారు. లీజు గడువు ముగిసిన తర్వాత కూడా షట్టర్లు ఎలా కొనసాగుతున్నాయి? సబ్‌లీజులకు అధికారుల అనుమతి ఉందా? అదనపు అద్దె వసూళ్లపై అధికారులు విచారణ జరిపిస్తారా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దీనిపై మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి అధికారిక స్పష్టత ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా దుకాణం కొనసాగింపు**

మండల ప్రజా పరిషత్ పరిధిలోని ఓ దుకాణం లీజు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. 2015లో దుకాణం కేటాయింపునకు సంబంధించిన అండర్‌టేకింగ్ లెటర్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 04 జూలై 2015 తేదీతో రూ.100 నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై ఇచ్చిన ఈ అండర్‌టేకింగ్‌లో లీజుదారు పలు కీలక నిబంధనలను అంగీకరించినట్లు పత్రంలో స్పష్టంగా పేర్కొనబడింది. మండల ప్రజా పరిషత్ నిబంధనలకు కట్టుబడి ఉంటానని,కేటాయించిన దుకాణంలో తానే స్వయంగా వ్యాపారం నిర్వహిస్తానని, అద్దెలను క్రమం తప్పకుండా చెల్లిస్తానని అండర్‌టేకింగ్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా దుకాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు సబ్‌లెట్ చేయబోనని స్పష్టం చేశారు. తాను స్వయంగా వ్యాపారం నిర్వహించలేని పరిస్థితి ఏర్పడితే దుకాణాన్ని మండల ప్రజా పరిషత్‌కు తిరిగి అప్పగిస్తానని కూడా హామీ ఇచ్చారు. అంతేకాకుండా, భౌతిక తనిఖీ సమయంలో లేదా ఫిర్యాదు మేరకు దుకాణాన్ని ఇతరులకు సబ్‌లెట్ చేసినట్లు నిర్ధారణ అయితే తన డిపాజిట్‌ను సైతం కోల్పోవడానికి అంగీకరిస్తున్నట్లు, మండల ప్రజా పరిషత్ తీసుకునే చర్యలకు అభ్యంతరం ఉండదని అండర్‌టేకింగ్‌లో పేర్కొన్నారు. అవసరమైతే దుకాణాన్ని మరో అర్హుడైన వ్యక్తికి తిరిగి కేటాయించినా తనకు హక్కు ఉండదని కూడా స్పష్టం చేశారు.

**మూడేళ్ల గడువు ముగిసినా కొనసాగింపు ఎలా?**

అయితే, 2015లో దుకాణం పొందిన వ్యక్తే ఇప్పటికీ అదే దుకాణాన్ని కొనసాగిస్తున్నారు. లీజు కాలపరిమితి మూడు సంవత్సరాలుగా ఉన్నట్లయితే, ఆ గడువు ముగిసిన అనంతరం దుకాణం ఏ ప్రాతిపదికన కొనసాగుతోంది? లీజు పునరుద్ధరణకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారా? లేక కొత్తగా కేటాయింపు జరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

లీజు గడువు ముగిసినప్పటికీ అదే వ్యక్తి కొనసాగుతున్నట్లయితే, అందుకు సంబంధించిన రెన్యువల్ ఉత్తర్వులు, అద్దె చెల్లింపుల వివరాలు, మండల ప్రజా పరిషత్ తీర్మానం, కేటాయింపు లేదా పొడిగింపు ఉత్తర్వులు, తనిఖీ నివేదికలు తదితర వివరాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

**అధికారుల సహకారంపై ఆరోపణలు...**

లీజు గడువు ముగిసిన తర్వాత కూడా దుకాణాలు కొనసాగుతున్న వ్యవహారంలో మండల ప్రజా పరిషత్ అధికారుల సహాయ సహకారాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. అండర్‌టేకింగ్‌లో పేర్కొన్న నిబంధనలు అమలయ్యాయా? లీజు గడువు అనంతరం కొనసాగింపునకు అనుమతులు ఎవరు ఇచ్చారు? ఇప్పటి వరకు ఎంత అద్దె వసూలు చేశారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. 2015లో లీజుదారు స్వయంగా ఇచ్చిన అండర్ టేకింగ్‌లోని నిబంధనలు ఒకవైపు.. ప్రస్తుతం దుకాణం కొనసాగుతున్న పరిస్థితి మరోవైపు ఉండటంతో ఈ వ్యవహారంపై మండల ప్రజా పరిషత్ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. దుకాణదారుడు నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు సబ్ లేట్ చేశారు. ఇతరులకు సబ్ లేట్ చేయబోమని మండల ప్రజా పరిషత్ అధికారులకు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. అయినా నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణదారులపై మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి చర్యలు ఎలా ఉంటా యో వేచి చూడాల్సిందేనని పట్టణ వాసులు తెలుపుతున్నారు.

**మూడేళ్లకే లీజు గడువు.. ఏడేళ్లుగా కొనసాగింపేలా?**

మండల ప్రజా పరిషత్ దుకాణముల సముదాయంలోని షట్టర్ల లీజు గడువు పూర్తయి సుమారు ఏడేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. లీజు గడువు ముగిసిన తర్వాత కూడా దుకాణాలు కొనసాగుతున్న పరిస్థితిపై పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.లీజు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇంతకాలం ఎందుకు స్పందించలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లీజు పొడిగింపునకు అనుమతులు ఇచ్చారా? ఇచ్చి ఉంటే వాటికి సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? లేక గడువు ముగిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజాధనానికి సంబంధించిన దుకాణాల లీజు వ్యవహారంలో పారదర్శకత పాటిస్తూ, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# జోడు పదవులు లక్షల్లో దందా!

మొదటి పేజీ తరువాయి...

“అటు నేనే... ఇటు నేనే” అంటూ పంచాయతీ పీఠాన్ని ఇసుక సొసైటీ అధ్యక్ష పదవిని రెండింటినీ దక్కించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఇసుక క్వారీ ద్వారా కోట్లాది రూపాయల నిధులు దారి మళ్లుతున్నాయని గతంలోనే ‘ అక్షిత ’ పత్రిక బహిర్గతం చేసింది.

అంతేకాకుండా మాజీ సర్పంచ్ హయాం నుంచి ఇప్పటివరకు ఇసుక క్వారీ నిర్వహణ ఉపాధి హామీ రహదారుల నిర్మాణాల్లో భారీ ఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగిందని ‘ అక్షిత’ కథనం ద్వారా స్పష్టమైనప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్పంచ్ దంపతుల అక్రమాలు రోజురోజుకూ శృతిమించుతున్నాయని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.

**చట్టవిరుద్ధంగా రెండు పదవులు..**
**తీవ్ర ప్రయోజనాల సంఘర్షణ!**

రాజ్యాంగ బద్ధమైన గ్రామ సర్పంచ్ పదవిలో ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక లావాదేవీలు సాగే ఇసుక సొసైటీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న రామానుజవరం గ్రామ సర్పంచ్ కల్పన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్పంచ్‌గా ఎన్నికవ్వడానికి ముందే ఇసుక సొసైటీ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె సర్పంచ్‌గా గెలిచిన తర్వాత కూడా ఆ పదవికి రాజీనామా చేయకపోవడం తీవ్రమైన ‘ప్రయోజనాల సంఘర్షణ’ కు దారితీస్తోందని స్థానిక ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇసుక సొసైటీలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఇసుక తవ్వకాలు రవాణాలో పారదర్శకత లేకపోవడంతో ప్రభుత్వ రాబడికి తీవ్ర గండి పడుతోందని వార్డు సభ్యులు స్పష్టం చేస్తున్నారు.

**వంద చొప్పున రూ. 13 లక్షల దందా..**
**లెక్కలడిగితే బెదిరింపుల పర్వం!**

గ్రామాభివృద్ధి పేరిట సాగుతున్న అక్రమ వసూళ్ల పర్వం రామానుజవరంలో పరాకాష్టకు చేరింది. ప్రతి


అక్షిత
General జనరల్
నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్
“అటు నేనే... ఇటు నేనే”



ఇసుక లారీ నుండి గ్రామాభివృద్ధి పేరుతో లారీకి వంద రూపాయల చొప్పున ఇప్పటివరకు సుమారు 13 లక్షల రూపాయల భారీ మొత్తాన్ని వసూలు చేసినట్లు గ్రామస్తులు వివరిస్తున్నారు. తీరా ఈ నిధుల లెక్కలేవని గ్రామానికి చేసిన అభివృద్ధేమిటని గ్రామ ప్రజలు నిలదీస్తే కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఉన్నాయంటూ పచ్చి అబద్ధాలు చెప్తూ బొంకడం సర్పంచ్ భర్త శైలిగా మారింది. మిగిలిన 8 లక్షల రూపాయల సొమ్ము ఏమయ్యాయని ప్రశ్నించిన వారిపై బాహటంగానే బెదిరింపులకు దిగుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజాధనానికి జవాబుదారీగా ఉండాల్సిన స్థానంలో ఉండి స్వప్రయోజనాల కోసం పంచాయతీ సొమ్మును దారి మళ్లించడమే కాకుండా ప్రశ్నించిన పౌరులను వార్డు సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం సర్పంచ్ కుటుంబానికే చెల్లింది. ఈ రూ. 13 లక్షల ఇసుక లారీల వసూళ్ల అక్రమాలపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపి, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని రామానుజవరం గ్రామస్తులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.

**పాలనలో సర్పంచ్ భర్త ‘బాడిష సతీష్’ అక్రమ జోక్యం!**

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాన్ని పక్కనపెట్టి, సర్పంచ్ భర్త బాడిష సతీష్ పంచాయతీ పాలనలో అక్రమంగా జోక్యం చేసుకుంటున్నారని వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో జరిగే పనులకు అక్రమంగా బిల్లులు చేసుకోవడమే కాకుండా కనీసం ఉప సర్పంచ్ అనుమతి కానీ సంతకం కానీ కనీస సమాచారం కూడా లేకుండా నిధులు డ్రా చేస్తున్నారని తెలిపిచ్చారు. అంతేకాకుండా పంచాయతీ నిధులను స్వప్రయోజనాలకు వాడుకుంటూ దీనిపై ప్రశ్నించిన వార్డు సభ్యులపై సర్పంచ్ భర్త బాడిష సతీష్ తీవ్రమైన బూతులతో విరుచుకుపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఉప సర్పంచ్ కే. రాణి వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

**కలెక్టర్, ఎంపీవో, ఎమ్మెల్యేలకు ఆధారాలతో ఫిర్యాదు..**
**సర్పంచ్ పదవి ఊడేనా?**

గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం చట్టవిరుద్ధంగా రెండు పదవుల్లో కొనసాగడం మరియు పాలనలో సర్పంచ్ భర్త అక్రమ జోక్యాలపై ఉప సర్పంచ్ కె.రాణి సహా వార్డు సభ్యులంతా ఏకమై జిల్లా పంచాయతీ అధికారికి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకి ఆధారాలతో కూడిన ఫిర్యాదులు సమర్పించారు. పంచాయతీ రాజ్ చట్టం నిబంధనల ప్రకారం ప్రయోజనాల సంఘర్షణకు పాల్పడుతూ అధికార దుర్వినియోగానికి ఒడిగట్టిన సర్పంచ్ కల్పనను తక్షణమే పదవి నుండి తొలగించాలని ఆమె భర్త బాడిష సతీష్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ‘ అక్షిత ’ కథనం ఇప్పుడు వార్డు సభ్యుల రాతపూర్వక ఫిర్యాదులతో నిష్పాక్షిక విచారణ జరిపితే సర్పంచ్ పదవి ఊడిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆహ్లాదం... ఆనందం



మొదటి పేజీ తరువాయి...

రానుంది. చెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల తీరును సమీక్షించి, అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని, ఎక్కడా నాణ్యతలోపాలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులు నగర పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చెరువులను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించవచ్చని తెలిపారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వాతావరణం అందుబాటులోకి రావడంతో పాటు చెరువు పరిరక్షణకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు చెరువుల పరిరక్షణ, పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రూ.19 కోట్లతో చేపడుతున్న రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను నాలుగు రకాలుగా
# విభజించాలి





**అక్షిత న్యూస్, హాలియా:** ఇంటి వద్దనే వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేయాలి -- పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలిలి

నాగార్జునసాగర్ నియోజకవర్గ హాలియా పురపాలక సంఘం పరిధిలోని సాయి ప్రతాప్ నగర్‌లో లికేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖలి మార్గదర్శకాల ప్రకారం లిఘన వ్యర్థాల నిర్వహణలి పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, హానికరమైన వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అనే నాలుగు రకాలుగా వేరు చేసి, మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించడం జరిగింది. వ్యర్థాలను సరైన పద్ధతిలో వేరు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు పట్టణ పరిశుభ్రతను మెరుగుపరచ వచ్చని వివరించారు.

అదేవిధంగా, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకునే అలవాటును కూడా పెంపొందించుకోవాలని, పొడి వ్యర్థాల్లో పునర్వినియోగానికి, రీసైక్లింగ్‌కు అనువైన వ్యర్థాలను సంబంధిత రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అవగాహన కల్పించారు. హానికరమైన మరియు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా, తగిన విధంగా సేకరించి పారవేయడం ద్వారా పర్యావరణానికి కలిగే హానిని తగ్గించవచ్చని తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, హాలియా పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని అధికారులు కోరారు.

ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఖలీల్, మున్సిపల్ జవాన్లు అశోక్, శ్రీను, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రామన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

### రిజిస్టర్డ్ కమిటీని పునరుద్ధరణ




**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** రామన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులు గా తెలుసూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గా బత్తుల గణేష్ లు ఎన్నికై, రామన్నపేట రిజిస్టర్డ్ ప్రెస్ క్లబ్ ను పునరుద్ధరణ చేసి నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కొండ మల్లేశం గౌడ్, గౌరవ సలహాదారులు గా రుద్రాల శ్రీరాములు, కెవి సుధాకర్ రాజు, అధ్యక్షులు గా తెలుసూరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శి గా బత్తుల గణేష్, కోశాధికారి గా నడిగోటి నగేష్, ఉపాధ్యక్షులు గా సిర మహేష్, నోముల శంకర్, సహాయ కార్యదర్శి గా ముత్యాల రమేష్, కార్యవర్గ సభ్యులుగా నాగటి యాదయ్య, వీరమల్ల రమేష్ లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యలు, కమిటీ బలోపేతంకి కృషి చేస్తామని తెలుపుతూ, నూతన రిజిస్టర్డ్ కమిటీ ఎన్నిక విషయం అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల ప్రజలందరికీ తెలుపుతూ అందరీ సహకారం అందజేయాలి తెలిపారు

# డీజే సౌండ్ తగ్గించమంటే దాడి




**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లో డీజే బ్యాచ్ గంజాయి బ్యాచ్ ల ఆగడాలు మీతిమీరి పోతున్నాయి. నేలకొండపల్లి మండలం ముఠాపురానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చావా రమేష్ తమ కుటుంబ సభ్యుల అనారోగ్యం బాగోలేదని డీజే సౌండ్ తగ్గించమని కోరగా పదిమంది యువకులు కర్రలతో దాడికి పాల్పడ్డారని నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి మండలం చెర్వు మాదారం లో రెండు రోజుల క్రితం ఓ మహిళ డిజె సౌండ్స్ దాటికి మృతి చెందింది. అనంతరం మరోసారి డీజే పర్మిషన్ ఇవ్వటం వలన దసరా రోజు రెండు పార్టీల మధ్య చిచ్చు రేపింది. డీజే ల అనుమతి లేదని పోలీస్ శాఖ హెచ్చరించిన ఎలాంటి అనుమతులు లేకుండా ముఠాపురం లో మళ్లీ దుర్గామాత నిమజ్జనంలో డీజేలు పెట్టి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. డీజే గంజాయి బ్యాచ్ లకు పోలీసుల శాఖ హెచ్చరికలు పట్టించుకోకుండా డీజే లపై ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. డీజేలను పూర్తిగా నిషేధించాలని నేలకొండపల్లి మండలంలో గంజాయి బ్యాచ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అడవిదేవులపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు



**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అడవిదేవులపల్లి మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయమే లక్ష్యంగా, మిర్యాలగూడ నియోజకవర్గ నాయకుడు కోట్రా గోవర్ధన్ ఆధ్వర్యంలో అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేశారు.ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు మేకల సతీష్ రెడ్డి సూచనల మేరకు,ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లు మేడ రామకృష్ణ,పి.ఆర్.రాఘవేందర్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఇందులో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందిని కలిసి, అనంతరం ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు.ఈ సందర్భంగా కోట్రా గోవర్ధన్ మాట్లాడుతూ,అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రామాపురం మాతా శిశు వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్,హేమంత కేశవ్ పాటీల్ ఆరా





**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మండల పరిధిలోని రామాపురం మాతా శిశు వైద్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య కేంద్రంలో కొనసాగుతున్న వైద్య సేవలు, గర్భిణులు, బాలింతలు, శిశువులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలపై సంబంధిత వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైద్య కేంద్రానికి వచ్చే రోగులకు అందిస్తున్న సేవల నాణ్యత, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే సమయాలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల వినియోగం, ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. మాతా శిశు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన వైద్య సేవల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, వైద్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై సమీక్షించిన కలెక్టర్, మాతా శిశు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవలను సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రి రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో పారదర్శకంగా
# నియామక ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కొరకు నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు.



అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పి.జి. మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పి.జి. మార్కులకు నిర్దేశించిన వెయిటేజిని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్‌ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థి త్వరలో విధులలో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, త్రాగునీటి సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేపూరు గ్రామంలో ఎస్బిఐ జీవనం ప్రాజెక్ట్ హెల్త్ క్యాంపు

### గ్రామ సర్పంచ్ పెరుమాళ్ళ నాగరాజు




**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండల పరిధిలోని వేపూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ళ నాగరాజు అధ్యక్షతన ఎస్బిఐ జీవనం ప్రాజెక్ట్ వారు హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. క్యాంపులో టీబీ బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించారు. క్యాంపు లో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ళ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మురహరి, ఉపసర్పంచ్ కృష్ణయ్య. మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

### క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్స్‌ను కలవాలి

### మాజీ పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీ ఎన్నికల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయినపల్లి వినోద్ కుమార్





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** అక్టోబర్ 25న ఎస్వీ కన్వెన్షన్ హాల్ నందు ఉదయం 10 గంటలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ వోలు, ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తలు, బాధ్యులు, సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే డివిజన్ వారీగా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఈ పట్టభద్రుల స్థానంలో అత్యధిక ఓట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే నమోదు అయ్యేలా క్షేత్ర స్థాయిలో పని చేయాలని సూచించారు

వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎంపీ, బోయినపల్లి వినోద్ కుమార్ ని నియమించి సందర్భంగా శుక్రవారం రోజున హనుమకొండ అలంకార్ కాకతీయ కాలనీలోని బోయినపల్లి వినోద్ కుమార్ నివాసంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అధ్యక్షత వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.

కార్యక్రమంలో మాజీ చైర్మన్ డా.కే వాసుదేవ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వలస బాట పడుతున్న గిరిజన చెంచు కుటుంబాలు

### వివిధ చెంచు పెంటల నుండి 100 కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస

### తల్లిదండ్రులతోపాటు చిన్నారులు కూడా వలస బాట



**నాగర్ కర్నూల్ అక్షిత, ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని గిరిజన ప్రాంతాలలో ఉన్నటువంటి చెంచు కుటుంబాలు వలస బాట పడుతున్నారు. లింగాల మండలానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్ర పెంట, శ్రీరంగాపూర్, పద్మాన పల్లి, చెన్నంపల్లి, అ పా యి పల్లి , గ్రామాల నుండి గిరిజన చెంచు కుటుంబాలు ఇప్పటికీ100 కుటుంబాలు కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, భద్రాచలం హైదరాబాద్ తదితర ప్రాంతాలకు గుంపు మేస్త్రీలు గిరిజనుల రాత్రి రాత్రి వివిధ ప్రైవేటు వాహనాలలో వారికి తెలియని ప్రదేశాలకు తీసుకువెళ్లారు, వారితోపాటు వారి పిల్లలు కూడా విద్యకు దూరమై వలస బాట పట్టారు. గ్రామాలలో గిరిజనులకు జీవనో ఉపాధి లేకపోవడంతో అట్టి గిరిజనులపై వివిధ గ్రామాలలో ఉన్నటువంటి గుంపు మేస్త్రిలు వారిని ఇతర ప్రదేశాలకు తరలించి ఇష్టం సరిగ్గా పనులు చేపిస్తున్నారు. వారికి జ్వరం లేదా ఇతర అనారోగ్యాలకు గురైనప్పుడు ఎవరు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. గతంలో 2006 సంవత్సరంలో నాగర్ కర్నూల్ జిల్లాలో పెద్ద కొత్త పల్లి మండలంలోని మారేడు దిన్నె గ్రామంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి మృత్యువాత పడిన సంఘటన అందరికీ తెలిసిన విషయమే. మళ్లీ చెంచులపై గుంపు మేస్త్రిల కన్ను పడి నిరుపేద గిరిజనులను తీసుకువెళ్లి ఇష్టం సరిగ్గా పనులు చేయిస్తున్నారు. గుంపు మేస్త్రీల పై చర్యలు తీసుకోవాలని. గిరిజనులు ఏ ప్రాంతానికి తరలించారు అనేది కూడా సర్వేలు నిర్వహించి. స్వగ్రా వారికి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభలు..
# నీటి పొదుపుపై అవగాహన







**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయ పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం రామన్నపేట మండలంలోని సిరిపురం, వెల్లంకి, సర్నేనిగూడెం గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంతో పాటు, ప్రతి రైతు తన పొలంలో ఫారం పాండ్ (వ్యవసాయ కుంట) నిర్మాణానికి ముందుకు రావాలని తెలిపారు.

అలాగే వి.బి.-జి రామ్ జి పథకం కింద చేపట్టాల్సిన పనులు, జలసిరి పనులు, నీటి సంరక్షణకు సంబంధించిన ఇతర కార్యక్రమాలను గ్రామాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి, సాగునీటి ఇబ్బందులను తగ్గించుకోవచ్చని సూచించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామస్థులు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, కె రాఘవ రెడ్డి, ఎంపీడీఓ ఆవుల రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్, ఏ ఈ లు ఆశిష్ రాఘవ, సందీప్,, ఎంపీవో రఫీ, సర్పంచ్ లు, కార్యదర్శులు, హాజరు కావటం జరిగింది

# జెట్‌పోల్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల
# నిర్మాణ పనులను పరిశీలన

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నిర్మాణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం జెట్‌పోల్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణ ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు వివిధ దశల్లో సాధించిన పురోగతిని సమీక్షించి, ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించి పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న



పనులు, మిగిలి ఉన్న నిర్మాణ పనుల వివరాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.

నిర్మాణ పనులను వేగవంతం చేసి, మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల నిర్వహణలో సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

**శ్రీ మదన గోపాలస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు**

అంతకుముందు జిల్లా కలెక్టర్ జటప్రోలు గ్రామంలోని శ్రీ మదన గోపాలస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను సమర్పించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. జిల్లా కలెక్టర్ ఆలయ ప్రాంగణంలోని శిల్పకళా విశేషాలను పరిశీలించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, పెట్లవెల్లి డిప్యూటీ తాసిల్దార్ వెంకటేష్ ,ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

## జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

### విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్

### పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో :** అనంతరం ఎస్పీ మాట్లాడుతూ....విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని, పోలీస్ స్టేషన్ విధులు, ప్రజలకు అందించే సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల బాధ్యతలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని,పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై స్టాళ్లు ఏర్పాటు చేసి విదకల్పించారు అవగాహన కల్పించారు

ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిర్వహించే డే, నైట్ బీట్స్, పెట్రోలింగ్ విధానాలతో పాటు, పోలీస్ స్టేషన్ పనితీరు, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యల గురించి విద్యార్థులకు వివరించారు.

నేరస్తులను గుర్తించేందుకు పొలిసీ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల పనితీరును వివరించారు.

నేరాల నివారణతో పాటు, జరిగిన నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతనుతెలియజేశారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలు, వాటి విధుల గురించి వివరించారు.

పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి, బ్లాక్ చేసి రికవరీ చేయడంలో సీఈఐఆర్ వ్యవస్థ వినియోగంపై వివరించారు. బాంబ్ స్క్వాడ్ బృందం విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలను వివరించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు , ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్ బృందం ,కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పోలీస్ శాఖ విధులు, సేవలు, ప్రజల రక్షణ కోసం చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్, అనిల్, రంజిత్, ఆర్.ఎస్.ఐ సాయి కిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ సొసైటీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి;** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి బి మోహన్, అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, జనరల్ మేనేజర్ మార్పాటి రామ్ రెడ్డి లు శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు రైతుల నుండి పత్తిని క్వింటాకు 9210 తో కొనుగోలు చేశారు .ఈ కార్యక్రమంలో మిల్ మేనేజర్ అభిలాష్ రెడ్డి, సొసైటీ కార్యవర్గ సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోదల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించిన డిఈఓ రమేష్ కుమార్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** బల్మూర్ మండల పరిధిలోని గోదల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ శుక్రవారం సందర్శించారు. దసరా పండుగ సెలవులు ముగించుకొని శుక్రవారం పాఠశాలలో పునర్ ప్రారంభం కావడంతో డిఇఓ పాఠశాల సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా ఫాలో అప్ చేయాలని తెలిపారు. సిలబస్ ప్రకారం పూర్తిచేయాలని. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి 100% ఉత్తీర్లత సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎం రామ్ సింగ్, ఉపాధ్యాయ బృందం శేఖర్, తాహెర్ పాష, రూప్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు చూపు బీజేపీ వైపు

## పాగర్తి సుధాకర్



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం చెర్వుమాదారం గ్రామం లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బీజేపీ కి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అర్హత కల్గిన ప్రతిఒక్కరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని మండలం లోని పట్టభద్రులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమం బీజేపీ మండల కార్యక్రమ కన్వీనర్ మల్లెబోయిన గోవిందరావు నాయకులు కార్యక్రమం మండల కో కన్వీనర్ సయ్యద్ మోహినుద్దీన్ సూరెపల్లి జ్ఞానరత్నం నాయకులు కొండా హర్షవర్ధన్ గెల్లా చక్రపాణి ఏపూరి సత్యనారాయణ మండల సోషల్ మీడియా కన్వీనర్ కందరబోయిన గోపి గెల్లా గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఎంఎన్ స్టీల్ వుడ్ డోర్స్ షోరూమ్ ప్రారంభం



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం నగరం ఖానాపురం హవేలిలోని మొగిలి పాపిరెడ్డి పంక్షన్ హాల్ దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎన్ స్టీల్ వుడ్ డోర్స్ షోరూమ్‌ను ప్రముఖ కవి రిటైర్డ్ ప్రిన్సిపాల్ యాకూబ్ గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ అధునాతనమైన టెక్నాలజీతో స్టీల్ వుడ్ డోర్లు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. షోరూమ్ నిర్వాహకులు షేక్ రఫీ( కేరళ) షేక్ మహమ్మద్ పాషా షేక్ అఫ్రిది మాట్లాడుతూ ఖమ్మంలో ఇది రెండో బ్రాంచ్ అని తెలిపారు. అందరికీ సరసమైన ధరలలో అన్ని సైజులలో డోర్లు లభిస్తాయని తెలిపారు. కస్టమర్లు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని తమకు సహకరించాలని కోరారు.

## ఆటో డ్రైవర్ కుమారునికి డాక్టర్ సీటు

**సన్మానించిన ఎంపిజే బృందం**

**నీట్-2026లో 468 మార్కులతో సత్తా చాటిన హుస్సేన్ జాఫర్**



**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఆటో డ్రైవర్ కుమారుడైన హుస్సేన్ జాఫర్ వైద్య విద్యలో సీటు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ జాఫర్ నీట్-2026లో 468 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 16,793వ ర్యాంక్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 2407వ ర్యాంక్ సాధించాడు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు పొందాడు.

ఈ సందర్భంగా ఎంపీజే ఖమ్మం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ జాఫర్‌ను అభినందించారు.

జాఫర్ తండ్రి షేక్ మదార్ సాహెబ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి జాఫర్ సాధించిన విజయం కుటుంబానికి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. పట్టుదల కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని అతను నిరూపించాడని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

స్థానిక ఎంపీజే కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో జాఫర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాసర్ అహ్మద్ కోశాధికారి ఎండి హకీమ్ కార్యదర్శులు బి సతీష్ రఫీ సభ్యులు ఖుర్షీద్ హుస్సేన్ మియా షరీఫ్ సువాన్ పాషా మహమూద్ జమాతే ఇస్లామీ హింద్ జిల్లా మాజీ అధ్యక్షులు ఖలీల్ అహ్మద్ సేవా బ్యాంక్ మేనేజర్ ఎండి మొయినుద్దీన్ ఎంపీజే సభ్యులు మునీర్ జానీ మియా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన కౌన్సిలర్



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల పట్టణానికి చెందిన సూరంపల్లి బాలమ్మ ఇటీవల మరణించినందున,12వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం కాజా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో చేర్యాల మాజీ కోఆప్షన్ నెంబర్ ఎండి ఖాజా మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టి యాదగిరి, మాచర్ల వెంకన్న, శనిగారి బిక్షపతి, తదితరులు ఉన్నారు.

# గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**లింగ నిష్పత్తి మెరుగుదలకు నిరంతర పర్యవేక్షణ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రైవేట్ వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులతో సమావేశమై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ల నమోదు, నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలుపై సమీక్షించారు. నూతన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న 13 ప్రైవేట్ ఆస్పత్రులు, 6 స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి, చర్చించిన అనంతరం అనుమతులు మంజూరు చేశారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా వాటికి సహకరించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వైద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్టులు తల్లి, శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య ప్రమాణాలను పాటిస్తూ సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ, జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీల సభ్యులతో సమీక్ష నిర్వహించి, జిల్లాలో అనుమతులతో పనిచేస్తున్న ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకున్నారు. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారించిన తర్వాతే అనుమతుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ చట్ట నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి నిహారిక, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా ప్రైవేట్ ఆస్పత్రుల అధ్యక్షుడు డాక్టర్ చెన్నయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకుందాం

**సర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలను నిలిపివేయాలి**

**మామిడి వెంకటరెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు**



**రామన్నపేట, అక్షిత ప్రతినిధి :** ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధానాలను, సర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలను, విద్యార్థులు, యువతపై పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా శుక్రవారం రామన్నపేట కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులు, యువత, మహిళలపై పోలీసుల దౌర్జన్యాలకు పాల్పడటం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలిపేందుకు ఉన్న అవకాశాలను పరిమితం చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రజల సమస్యలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ చేపట్టే క్రమంలో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని మామిడి వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలని సూచించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఆయన వ్యవహారశైలిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియను రద్దు చేసి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని కోరారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం న్యాయవాదులతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని, స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు జరిగేలా ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. మజీద్, సీనియర్ న్యాయవాది ఉయ్యాల హనుమంతు గౌడ్, న్యాయవాదులు కట్టెల లింగస్వామి, గాలి సుదర్శన్, అంకెం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



**అక్షిత ప్రతినిధి, మంచిర్యాల :** జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలంలోని భీమారం, భూరుగుపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యా కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ పనులు, పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, పంట కుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులు, గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంకుడు గుంతలు, సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. భీమారం గ్రామంలో చేపట్టిన పంట కుంట పనులను పరిశీలించి, వ్యవసాయ అవసరాలకు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవడం ఎంతో అవసరమని, నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో చేపట్టి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను సక్రమంగా, ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పనుల పురోగతి, రికార్డుల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని ఇంకుడు గుంతలను పరిశీలించి, నిర్వహణ తీరును సమీక్షించారు. గ్రామాలలో మురుగునీటి నిర్వహణ సక్రమంగా ఉండేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, త్రాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, వసతి గృహంలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సతీష్, ఏపీఓ, సంబంధిత గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గ్రామాల సమగ్ర అభివృద్ధికిసమన్వయంతో కృషి చేయాలి

## ఏఎంసీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి



**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్పంచుల జనరల్ బాడీసమావేశంలో చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిపాల్గొన్నారు. ఈసమావేశంలో మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన,రైతుల సమస్యలు, వ్యవసాయ రంగ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను గుర్తించి,వాటిపరిష్కారానికి ప్రాధాన్య త ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులుసమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు.

అలాగే, రైతులకు అవసరమైన సహకారం అందించడం, వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన సదుపాయాలు, పంటల విక్రయ సమయంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ రైతుల సంక్షేమానికి, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి కట్టుబడి పనిచేయాలని కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలుసాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ, వివిధ గ్రామాల సర్పంచ్ లు, పిఏసిఎస్ చైర్మన్ మరియు డైరెక్టర్లు వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొనడం జరిగింది.

# రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొత్త లింగస్వామి

## చికిత్సకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం కొమ్మాయిగూడెం గ్రామం, నిరుపేద కుటుంబానికి చెందిన కొత్త లింగస్వామి (శ్యామ్) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆయన రెండు చేతులు, పక్కటెముకలు విరిగిపోవడంతో ప్రస్తుతం నల్గొండలోని విజయ దుర్గ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్యామ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, దాతలు, మానవతావాదులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి శ్యామ్ త్వరగా కోలుకునేందుకు తోడ్పడాలని కోరుతున్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి బాధితుడికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రోగ్రాం



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల పోలిసు స్టేషన్ లో స్కూల్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఐ అపూర్వ రెడ్డి ఈ ప్రోగ్రాం గురించి విద్యార్థులతో మాట్లాడుతూ.. పోలిసు విధుల గురించి, పోలిసు స్టేషన్ లో ఏదైన తగాదా పై (పిటిషన్) దరఖాస్తు వచ్చిన తర్వాత, పిటిషన్ ఇచ్చిన విషయంపై ఎలా పరిష్కరిస్తారు అనే కోణంపై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా ఉద్యోగ చేస్తున్న సమయంలో మృతి చెందిన పోలీసుల గురించి గుర్తు చేస్తూ వారి గురించి వివరించి ఎస్ ఐ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ విధుల పై విద్యార్థులకు అవగాహన కల్పించిన రాజగోపాల్పేట పోలీసులు....



**సిద్దిపేట, అక్షిత ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాజగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సబ్ఇన్‌స్పెక్టర్ టి.వివేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పేట్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేపట్టే చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. పోలీసుల విధుల పట్ల అవగాహన కల్పించడం, పోలీస్ వ్యవస్థపై విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ పేట్ హెడ్మాస్టర్ టీ కనకయ్య మరియు రాజగోపాల్పేట్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

### సవరన్ మసీదులో సీపీ గౌష్ ఆలం ప్రత్యేక ప్రార్థనలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక సవరన్ మసీదులో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాజ రక్షణ కోసం, శాంతిభద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక దువా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ సమాజ శాంతి కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, విజయకుమార్, టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరికాన్ని అధిగమించి పీజీ మెడికల్‌లో రాణించిన డాక్టర్ రూత్ జాన్ పాల్



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరంలోని రమణగుట్ట మురికివాడకు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఎన్నో కష్టనష్టాలు అవమానాలను ఎదుర్కొంటూ చదువే లక్ష్యంగా ముందుకు సాగారు. తల్లి దండ్రుల దగ్గర ఉంటూ హైస్కూల్ ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో ఖమ్మంకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు తదితరుల సహకారంతో హైదరాబాద్‌లో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నారు. అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగంలో పీజీ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు. పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపించిన డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను పలువురు అభినందించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న గద్దె వెంకటరామయ్య



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** హైదరాబాద్ అలయ్ బలయ్ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఖమ్మం జిల్లా దానవాయిగూడెం కి గద్దె వెంకటరామయ్య పురస్కారం అందుకున్నారు. ఖమ్మం పట్టణానికి చెందిన సామాజికవేత్త గద్దె వెంకటరామయ్య హైదరాబాదులోని నాంపల్లిలో గల ఎగ్జిబిషన్ గ్రౌండ్లో మాజీ కేంద్రమంత్రి మాజీ గవర్నర్ చేతుల మీదుగా అలయ్ బలయ్ కార్యక్రమంలో వెంకట్రామయ్య సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేస్తున్నట్లు అలయ్ బలయ్ ఫౌండేషన్ వారు అన్నారు. ఈ సందర్భంగా గద్దె వెంకట రామయ్య మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేసిన బండారు దత్తాత్రేయ విజయలక్ష్మి మేడమ్ అలై బలై ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పుష్కర ఘాట్ల పనులు

### పుష్కరాల పనుల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం అవసరం

### రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి బాసరలో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

**పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం**
**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు. పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఈ పరిశీలనలో ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

### కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోవాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి




**చౌటుప్పల్ / అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మండల పరిధిలోని స్థానిక పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడుతూ... చౌటుప్పల్ మండలంలో అనేక పరిశ్రమలు ఉన్నప్పటికీ, స్థానిక నిరుద్యోగ యువతకు తగిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. స్థానికంగా పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నప్పుడు ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థానిక నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వారి ఉపాధి సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని బూరుగు కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు జిల్లా కమిటీ సభ్యులు రాగిరి కిష్టయ్య,మండల కార్యదర్శి వర్గ సభ్యులు చింతల సుదర్శన్, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, ఆదిమూలం నందీశ్వర్,పొట్ట శ్రీనివాస్,ఎల్లమల్ల సంజీవ, మీసాల శీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి



**భద్రాచలం అక్షిత న్యూస్:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక, భద్రాచలం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అమరవీరుల స్థూపాల వద్ద ఈ నిరసన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మారెడ్డి శివాజీ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శివ ప్రశాంత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దొడ్డి దారిన ఎన్నికల కమిషన్ ను ఉపయోగించుకొని అధికారంలో కొనసాగాలని ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం సర్ ప్రోగ్రాం పేరుతో దేశంలో ఇప్పటికే 14 కోట్ల ఓట్లను తొలగించారని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. అనేక అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్న జ్ఞానేశ్వర్ ను తీసుకువచ్చి ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ గా నియమించుకొని తమ సొంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. సర్ ప్రోగ్రాం లో మతం ఆధారంగా ఓట్లను తొలగించే కార్యక్రమం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బిజెపికి ఏజెంటుగా పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడేందుకు వామపక్ష, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.